యథేచ్ఛగా మట్టి దందా

- పంట కాలువ తవ్వగా వచ్చిన మట్టి హాంఫట్
- మట్టి అక్రమ రవాణాలో టీడీపీ నేతలు
- రైతుల పొలాలకే నంటూ బుకాయింపు
- జోరుగా జేబులు నింపుకుంటున్న వైనం


ట్రాక్టర్లలో లోడింగ్ చేస్తున్న మట్టి

కంకిపాడు: టీడీపీ నేతలు యథేచ్ఛగా మట్టి దందాకు తెరలేపారు. ఆఖరికి పంట కాలువ తవ్వగా వచ్చిన మట్టిని కూడా వదల్లేదు. వ్యర్థాలతో కూడిన మట్టిని సైతం అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. కాలువ మట్టిని రైతుల పొలాల్లోకి మెరకలకు అని చెబుతూ అడ్డగోలుగా మట్టిని తరలించేస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే తపనలో ఎలాంటి అనుమతులు లేకుండా, ఎవరు మమ్మల్ని ఆపేదంటూ బరితెగిస్తున్నారు. కోమటిగుంట రెగ్యులేటర్ పరిధిలోని వెంట్రప్రగడ ఇరిగేషన్ సెక్షన్ కింద పునాదిపాడు–గుడివాడ రోడ్డు నుంచి కోలవెన్ను గ్రామంలోకి వెళ్లే ప్రధాన పంట కాలువ ఉంది. ఈ కాలువలో పేరుకున్న గుర్రపుడెక్క తొలగింపును అధికారులు ఇటీవల నిర్వహించారు. కాలువలో తూడు, మట్టిని తీసి రోడ్డు మార్జిన్‌లో గుట్టలుగా పోశారు.

మట్టిపై కన్నేసిన టీడీపీ నేతలు....

కాలువలో పూడికతీత ద్వారా వచ్చిన మట్టిపై కోలవెన్నుకు చెందిన కొందరు టీడీపీ నేతలు కన్నేశారు. గడిచిన మూడు రోజులుగా పగలూ, రాత్రి మట్టి తరలింపు పనుల్లో నేతలు మునిగిపోయారు. పొక్లెయిన్‌మట్టి గుట్టలను ఎత్తి ట్రాక్టర్లలో లోడు చేయించి గ్రామంలోకి తరలిస్తున్నారు. ఇందుకు ఒక్కో ట్రాక్టరు మట్టిని రూ.1500 కి విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ నిధులతో కాలువలో గుర్రపుడెక్క తొలగిస్తే తద్వారా వచ్చిన మట్టిని సైతం టీడీపీ నేతలు అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. మట్టి తరలిస్తున్న విషయాన్ని ఏ ఒక్కరు ప్రశ్నించినా తాము అమ్ముకోవటం లేదని, రైతులకు పొలాల్లో మెరకకు పంపుతున్నామని నేతలు బుకాయిస్తున్నారు. మట్టి అక్రమ రవాణా విషయం చర్చనీయాంశంగా మారింది.

ఎవరు ఆపుతారు?

కాలువ మట్టి తోలుకునే విషయాన్ని స్వయంగా స్థానిక ఎమ్మెల్యేకి చెప్పామని, ఆయన అనుమతితోనే మట్టి తోలుకుంటున్నామని, ఎవరు ఆపుతారో? చూస్తామంటూ టీడీపీ నేతలు చెప్పుకోవటం గమనార్హం. మట్టి తరలింపు ప్రదేశానికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఇదే చెబుతుండటంతో అధికారులు సైతం ఆ వైపు కన్నెత్తి చూసేందుకు సాహసించటం లేదు. మట్టి రవాణా సాగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోవటం విమర్శలకు తావిస్తోంది. అధికార పక్షానికి తలొగ్గి అక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమ్ముళ్లు మాత్రం అధికారం అండతో ఎలాంటి అనుమతులు లేకపోయినా అడ్డగోలుగా వందలాది ట్రాక్టర్ల మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

కోలవెన్ను కాలువలో గుర్రపుడెక్క తొలగించటానికి రూ.20 వేలు వరకూ ఖర్చుపెట్టాం. తద్వారా వచ్చిన మట్టిని తరలిస్తున్నారని తెలిసి సిబ్బంది వెళ్లి ఆపారు. అయితే ఎమ్మెల్యే పేరు చెప్పారని తెలిసింది. అయినా పనులు ఆపమని ఆదేశించటం జరిగింది. అనుమతులు లేకుండా మట్టి తోలేందుకు వీలు లేదని చెప్పాం. మట్టి పూర్తిగా తరలించారని తెలీదు. అక్రమ మట్టి రవాణా విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాము. విచారించి శాఖాపరమైన చర్యలు చేపడతాం.

–రాజగోపాల్, ఇరిగేషన్ ఏఈ, వెంట్రప్రగడ సెక్షన్

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పలువురికి వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి చెక్కులు ఎమ్మెల్యే బోడెప్రసాద్ అందచేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పలువురు బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 24,67,621 చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, బాధితులు పాల్గొన్నారు.

388 మందికి ఉచిత వైద్య సేవలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో గురువారం 388 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. గ్రామంలో శ్రీనివాసానగర్‌కాలనీలో షిరిడీ సాయిబాబా సేవా మందిరం ఆధ్వర్యంలో పటమట పీవీఆర్ కార్డియాక్, మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె వైద్య శిబిరం నిర్వహించారు. గుండె వైద్యంతో పాటు మెదడు, నరాలు ఎముకలు, కీళ్లు, ఈఎన్‌టీ, గైనిక్‌పరీక్షలు చేశారు. గుండె పరీక్షల్లో ఈసీజీ, ఎకో, పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా సమితి అధ్యక్షుడు మున్నంగి అర్జున్‌రెడ్డి, ఆస్పత్రి ఫౌండర్ వావిలాల రజినీకాంతశర్మ, డాక్టర్లు వినయ్, దివాకర్ ,సుభద్ర, షరిడి సేవా సమితి సభ్యులు, ఆస్పత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



ఉయ్యూరు: విశాఖపట్నంలో లా విద్యార్థినిపై లైంగిక దాడిని నిరసిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఉయ్యూరులో ప్రజాసంఘాలు గురువారం ప్రదర్శన నిర్వహించాయి. ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ప్రధాన సెంటరులో నిరసన తెలిపారు. మానవహారంగా ఏర్పడి మహిళలకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సలీం, రాజా, హారిక, ఐద్వా నాయకురాలుకీర్తి, సీపీఎం పట్టణ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

నేడు పోరంకిలో విద్యుత్ నిలిపివేత

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు పోరంకి ఫీడర్ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా గ్రామంలో సీతాపురంకాలనీ, శ్రీనివాసా నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, కృష్ణవేణి పాఠశాల ప్రాంతం, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. స్థానికులు సిబ్బందితో సహకరించాలని సూచించారు.

ఘనంగా మత్స్య సంపద దినోత్సవం

ఉయ్యూరు: ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం ప్రపంచ మత్స్యసంపద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన చేప, రొయ్యలు ఆహార పదార్థాల ప్రదర్శనను విజయవాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన 23 రకాల ఆహార పదార్థాలను పరిశీలించి అభినందించారు. ఎక్సైజ్ ఎస్ఐ రామశేషయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం


ఐడీబీఐ బ్యాంకును ప్రారంభిస్తున్న జీఎం వాసుదేవ్, వ్యాపారవేత్త నూకల

ఉయ్యూరు: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నామని ఐడీబీఐ జనరల్ మేనేజర్ వి.వాసుదేవన్ అన్నారు. ఉయ్యూరు రావిచెట్టు బజారులో నూతన భవనంలో ఏర్పాటుచేసిన బ్యాంకును గురువారం ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారవేత్త నూకల వెంకట సాంబశివరావు, పట్టణ ఎస్ఐ విశ్వనాథ్, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావుతో కలిసి జీఎం వాసుదేవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2100 శాఖలతో మెరుగైన సేవలు అందిస్తూ 5 వేల కోట్ల లాభంతో బ్యాంకు నడుస్తుందని చెప్పారు. వ్యవసాయ, బంగారు, గృహ, వ్యాపార రుణ సదుపాయాలు కల్పిస్తూ ఆయా వర్గాల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకే బ్యాంకును ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ హెడ్ ఆర్.సాయికృష్ణ, బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్, వెనిగళ్ల కుటుంబరావు, మాజేటి శ్రీనివాస్, నిడుమోలు పూర్ణ, వెంట్రప్రగడ బాబ్జీ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం సేకరించాలి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దారు శివయ్య

గన్నవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని తహసీల్దారు కేవీ శివయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై పీఏసీఎస్, డీసీఎంఎస్, డీఈఓ, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ధాన్యం సేకరణ సమయంలో తేమ శాతం అంచనా కచ్చితంగా ఉండాలని చెప్పారు. ట్రక్ షీట్ జనరేషన్, ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాక్ రికార్డింగ్ సిస్టం పక్కాగా ఉండాలని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం సూచించిన నిర్ణీత గడువులోపు వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి వై. రజని, సివిల్ సప్లైడీటీ ఎస్‌వీఎస్. ప్రధాని, పలు సొసైటీల కార్యదర్శులు, మిల్లర్స్, వీఆర్వోలు, వీఏఏఎస్‌లు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక చేయూత

ఉయ్యూరు: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని లయన్స్ కేబినెట్ డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి అభినయ్‌కు విద్యా ప్రోత్సాహం కింద రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ప్రతినిధులు నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రేకుల షెడ్డు దగ్ధం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో రేకులషెడ్డు దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ అధికారి (ఇన్‌చార్జి)షేక్ బాజీ తెలిపిన వివరాల మేరకు.... నున్న గ్రామం అంబేడ్కర్ విగ్రహం వద్ద బేతపూడి శ్రీనివాసరావుకు చెందిన రేకుల షెడ్డు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదానికి గురైంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో గృహోపకరణాలు, గ్యాస్ పొయ్యి, బట్టలు కాలిపోయాయి. ఆస్తి నష్టం రూ. 70వేలు ఉంటుందని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది సీహెచ్ శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, స్థానికులు మంటలను అదుపుచేశారు.

అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: పోరంకిలో సూపర్‌మార్కెట్ అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తి పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం... పోరంకికి చెందిన వెలగపూడి కుశవర్ధన్ గ్రామంలో కేబీసీ హైట్స్‌లో ఉంటున్నాడు. ఆయన తన సోదరి జాస్తి రత్నకుమారితో కలిసి పోరంకిలో అక్షయ సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. అయితే ఈ నెల 13, 14 తేదీల్లో రమ్య అనే మహిళ సూపర్‌మార్కెట్‌లో బిల్లింగ్ వర్కు చేయగా ఆమె పని సక్రమంగా చేయకపోవటంతో పని మానేసింది. కాగా బుధవారం రమ్య తండ్రి నరేష్ షాపు వద్దకు వచ్చి రెండు రోజులు తన కుమార్తె పని చేసినందుకు జీతం అడిగాడు. దీంతో షాపు యాజమాని కుశవర్ధన్ రమ్యను పనిలో చేర్పించింది ఆమె తల్లని, ఆమె వస్తే జీతం ఇస్తామని తెలిపారు. దీంతో నరేష్ ఆగ్రహంతో రాయితో షాపుకు ఉన్న విలువైన అద్దాలు ధ్వంసం చేశాడు. ఈ ఘటన పై షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే విధ్వంసాలు


కూల్చివేసిన నిర్మాణాలు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకే ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడంతో పాటు ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ధ్వజమెత్తారు. స్థానిక శ్రీఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్యకు చెందిన స్థలంలో అధికారులు కూల్చివేసిన కట్టడాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి విరుద్ధంగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. వీటి నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని ధ్వజమెత్తారు. నిబంధనల పేరుతో కోట్లు విలువైన ఆస్తులను ధ్వంసం చేయడం, వ్యాపారులను రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు. ఈ కూల్చివేతలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. జాతీయ రహదారి పక్కన అనేక అనధికార నిర్మాణాలు ఉన్న కేవలం పరంధామయ్యకు చెందిన స్థలంలోనే చర్యలు తీసుకోవడం దారుణమన్నారు.

ఘనంగా ముగిసిన శ్రీసూక్త మహా యాగం


శ్రీసూక్త మహాయాగంలో పాల్గొన్న శ్రీదత్తవిజయానందతీర్థస్వామి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని శ్రీపంచతత్వ గురుపాదుకా క్షేత్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీసూక్త మహా యాగం గురువారం ఘనంగా ముగిసింది. శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆదేశాల మేరకు శ్రీదత్త విజయానంద తీర్థ స్వామి పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ క్రతువును జరిపారు. తొలుత గురువందనం, గణపతి ప్రార్థన తర్వాత హోమాన్ని తిరిగి ప్రారంభించారు. అనంతరం స్వామిజీ నేతృత్వంలో శ్రీచక్ర అర్చన, మహా పూర్ణహుతి, కలశ ఉద్వాసన ద్వారా శ్రీసూక్త మహా యాగానికి పరిసమాప్తి పలికారు. ఈ సందర్భంగా భక్తులకు శ్రీదత్త విజయానంద తీర్థస్వామి అనుగ్రహ భాషణం చేశారు. క్షేత్ర కమిటీ ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. ఆశ్రమ నిర్వాహకులు గొంది రాజా, ఎం. ప్రభాకరచౌదరి, రామ్మోహన్ రావు, క్షేత్ర పండితులు ప్రవీణ్‌శర్మ, పరిసరా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తికపూజలు


పూజలకు హాజరైన సాధనా నిలయం పీఠాధిపతి కృష్ణమ్మ స్వామి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ ప్రాంగణంలో మాజీ జెడ్పీటీసీ కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో గురువారం పలు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణదుర్గ సదర్మ సాధనాని లయం ఆశ్రమ పీఠాధిపతి కృష్ణమ్మ స్వామి వారు హాజరై పూజల్లో పాల్గొన్నారు. భక్తులు విశేషంగా తరలివచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. పుష్యమి నక్షత్రం సందర్భంగా సాయిబాబా భజనను భక్తి శ్రద్ధలతో చేశారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగ ప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

వైభవంగా మహా కుంభాభిషేకం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని పార్వతి సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. కార్తికమాసం పురస్కరించుకుని ఆలయంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు అన్నాభిషేకము, పంచహారతులిచ్చారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామి సన్నిధిలో సహస్ర లింగార్చన


సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో గురువారం సహస్ర లింగార్చన జరిగింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు సహస్ర లింగార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ జరిగింది. ప్రదోష కాలంలో మల్లేశ్వర స్వామి వారికి పంచ హారతుల సేవ, మహా నివేదన సమర్పించారు. అనంతరం ఆకాశ దీపం వెలిగించగా, ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ జరిగింది. ఆలయ అధికారులు, ఉభయదాతలు, భక్తులు కుటుంబ సమేతంగా దీపాలంకరణ సేవలో పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ప్యాచ్ వర్కు


కానూరు ప్రధాన రహదారికి తారుతో ప్యాచ్ వర్క్ చేస్తున్న దృశ్యం

పెనమలూరు: కానూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని తాము అధికారంలోకి వస్తే రోడ్డు నిర్మాణం చేస్తామని కూటమి నేతలు చెప్పిన మాటలు అధికారంలోకి వచ్చిన తరువాత చేతులెత్తేశారు. రోడ్డు అధ్వానంగా ఉండి నడటానికి కూడా వీలు లేక పోవటంతో జనాల ఒత్తిడి తట్టుకోలేక తారుతో తూతూమంత్రంగా ప్యాచ్ వర్కు చేసి చేతులెత్తేశారు. కానూరు ప్రధాన రహదారి కామయ్యతోపు బందరు రోడ్డు నుంచి కానూరు గ్రామంలోకి దాదాపు రెడున్నర కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రోడ్డు ఆర్ అండ్ బీ పరిధిలో ఉంది. గతంలో టీడీపీ పాలనలో ఈ రోడ్డు నిర్మాణం చేస్తామని ప్రకటనలు చేసి వదిలేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో రోడ్డు మరమ్మతులు చేశారు. అయితే ఆటోనగర్ నుంచి భారీ వాహనాలు ఈ రోడ్డులో రాకపోకలు సాగించటంతో రోడ్డు తరచుగా గుంతల మయంగా మారుతుంది. దీని కారణంగా గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంట కాలువ రోడ్డు వద్ద కొంత రోడ్డు బిట్టు వేసి వదిలేశారు. చాలా ప్రాంతాల్లో రోడ్డు ప్యాచ్‌వర్కు చేయక పోవటంతో గుంతలు ఉండిపోయాయి. దీంతో గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. తమ కష్టాలు ఎప్పడు తీరుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా కానూరు రోడ్డులో భారీ వాహనాలు రాకుండా నిషేధించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆటోనగర్ నుంచి భారీ వాహనాలు గ్రామం లోనుంచి వెళ్లటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే రోడ్డుపై గుంతలు పడుతున్నాయని అంటున్నారు.

- **హనుమాన్‌జంక్షన్ రూరల్:** బాపులపాడు మండలం వీరవల్లిలోని షిరిడీ సాయి బాబా మందిరంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పరమేశ్వరునికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగానికి, షిర్డీ సాయి బాబాకు పంచామృతాలతో వైభవంగా అభిషేకాలు చేశారు. బాబి, రావి ఈశ్వర్, బేబి సరోజిని, తవ్వా ఆదిలక్ష్మి, లంక పద్మశ్రీ పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర అందేనా?

- ప్రారంభమైన వరి కోతలు
- దిగుబడులపై రైతుల్లో ఆశలు
- ధరపైనే సందేహాలు
- ప్రభుత్వం స్పందించాలని వినతి


పెనమలూరులో యంత్రంతో వరి కోతలు


కోసిన వరిని ఆరపెడుతున్న రైతులు

పెనమలూరు: మండల పరిధిలో రైతులు వరి కోతలు ప్రారంభించారు. వరి దిగుబడులపై ఆశతో ఉన్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలు సక్రమంగా ఇస్తారా లేదా సాకులు చెప్పి కోత విధిస్తారా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో దాదాపు 5500 ఎకరాల్లో వరి సాగు చేశారు. వాతావరణ పరిస్థితుల ఆటుపోట్లు ఎదుర్కొని ఈ సీజన్‌లో సాగు చేశారు. ప్రధానంగా 1318, 1061 రకం వరి సాగు చేశారు. అయితే 1318 రకం వరి దిగుబడుల పై రైతులు ఆశతో ఉన్నారు. ఎకరాకు దాదాపు 40 బస్తాల దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. అయితే 1061 రకం వరి ఎకరాకు 30 నుంచి 35 బస్తాలే దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలో పంట దిగుబడి 15 వేల మెట్రిక్ వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మండల పరిధిలో కూలీల కొరత కారణంగా వరి కోత యంత్రాలతో వరి కోతలు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర సక్రమంగా అందేనా..?

ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రైతులకు కోత లేకుండా ధర సక్రమంగా ఇస్తారా లేదా అనే విషయమై రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణ రకం బస్తా ధాన్యం రూ.1725, ఏ గ్రేడు రూ.1740గా ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించింది. తేమ శాతం 17 ఉంటేనే ఈ ధర రైతులకు ఇస్తారు. దీంతో రైతులు యంత్రాలతో కోసిన పంట దిగుబడి ధాన్యం తేమ శాతం తగ్గించటానికి ధాన్యం ఎండపెడుతున్నారు. అయితే మిల్లర్లు తేమ శాతంలో రైతులకు తగిన న్యాయం చేయటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వింటాకు కేజీ ధాన్యం తగ్గించాల్సి ఉంది. అయితే మిల్లర్లు తేమ ఎక్కువగా ఉంటే ధాన్యం బస్తాకు ఏకంగా రూ.100 నుంచి రూ.150 వరకు తగిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు....

మండలంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ప్రారంభించలేదు. గన్నీ బ్యాగులు కూడా కేవలం 10 వేలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని చెబుతున్నా రైతులకు ఇప్పటివరకు స్పష్టమైన సమాచారం లేదు.

గిట్టుబాటు ధర ఇవ్వాలి



ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రైతులకు ఇవ్వాలి. తేమ శాతం పేరుతో రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి.

–దేవరాజు, పెనమలూరు